# ఎర్రమట్టి రోడ్డు



ఒరిస్సాలో,నాయ్‌గడ్ జిల్లాలో ఓ మారుమూల గ్రామం బాపూర్. ఆ గ్రామానికి వచ్చిపోయే వారికి " ఎర్రమట్టిరోడ్డు" ఒక వారధిలాంటిది. ఆ రోడ్డంతా ఎర్రమట్టే. అటువైపు చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఆ రోడ్డంతా అందరికీ పరమ అసహ్యం. జగుప్స, కోపం, ద్వేషం అలా పుట్టుకొస్తుంటుంది.

ఈ మాట ఎవరితోనైనా అంటే అన్నవారిని వింత మనిషిలా చూసి నవ్వుతారు.

అవును, నిజమే అదేమన్నా ప్రాణమున్న మనిషా, జంతువా, చెట్టు, చేమా, ఒట్టి ఎర్రమట్టిరోడ్డు. అయితే దానికో నీచమైన చరిత్ర ఉంది. ఎందరినో బలితీసుకుంది. మరెందరి పసుపుకుంకుమల్ని లాగేసింది. అది డాబర్‌మాన్ నాలుకలా ఎర్రగా ముందుకు సాగినట్లు కనిపిస్తుంది.

ఎండకీ, వానకీ తడిసి ముద్దయినా, మట్టికంపుతో, బురదతో నుజ్జునుజ్జయినా నడవడానికి వెనుకాడని కొందరికి ఆరోడ్డెప్పుడూ ఆహ్వానం పలుకుతూనే వుంటుంది.

ఎన్నెన్నో ఆశల్ని మూటగట్టుకొని వెళ్లినవారూ, పల్లకీ ఎక్కి ఊరేగింపుతో వెళ్లిన, శాపగ్రస్తులైన నవయవ్వన యువతులెంతోమంది వున్నారు. అందరూ ఎన్నో అగచాట్లు పడినవారే. ఆ రోడ్డు దాటుకుని నడవమంటే ఒక దుస్వప్నాన్ని నిజం చేసుకోవడమే.

నవయవ్వన జీవితాన్ని ముగ్ధమనోహరంగా, దిద్దుకోవాలనుకున్న వారంతా, అమాయకంగా ఆ రోడ్డుపై నడిచివెళ్లి చివరికి జీవన్మరణావస్థలో చిక్కిశల్యమైపోయిన వారే ఒకరా! రెండా అక్షరాలా మూడువేల మంది అభం, శుభం, అన్నెం, పున్నెం తెలియని లేలేతప్రాయంలో కిరాతకుల వలలో చిక్కి భ్రష్టులైపోయారు. అంతా మరే దారి లేక ఆ ఎర్రమట్టి రోడ్డును దాటివెళ్లినవారే.

రోడ్డుకిరువైపులా వున్న చెట్లన్నీ ఆ దారిన పోయే వారిని వెక్కిరిస్తున్నట్లే గాలికి వూగుతూ, రోడ్డుకు నేస్తం కట్టినట్లు అంటిపెట్టుకునే వుంటాయి. వాటి నీడలో ఎంతో ఒద్దికగా విషం కక్కే నాగుపాములా నాలుక చాచినట్లు పొడుగ్గా ముందుకు పోతున్నట్లు వుంటుందా ఎర్రమట్టిరోడ్డు.

'బాపూర్' గ్రామ నివాసి ' రాధామల్లి'కి ముగ్గురు ఆడపిల్లలు. భర్త అకాల మృత్యువాత చెందినందుకు నిత్యం కృంగుతూ వారిని పోషించడానికి నానా యాతన పడుతూ... ఇరుగు పొరుగు ఇళ్ళల్లో పనిచేస్తూ గుట్టుగా బ్రతకడం నేర్చుకుంది.

ఆమె ఇంటికి సరాసరి ఆ రోడ్డు ముందే ఝాన్సీ నుండి ఒక వ్యక్తి పెళ్లిసంబంధం కోసం వచ్చాడు. అతడి కళ్లు రాధామణి పెద్ద కూతురు ' కుముదిని' మీద పడ్డాయి.

చారడేసి కళ్లు, ముక్కుకి, చెవులకి చూడముచ్చటగా అమర్చినట్లు నగలు. యవ్వనంలో మిసమిసలాడినట్లు కనిపించిందాపిల్ల.

తలుపుతట్టి వచ్చిన అదృష్టాన్ని ఎవరు కాలదన్నుకుంటారని భ్రమపడిందా తల్లి. నలుగురిని కూడేసి పెళ్లి చేసి సాగనంపింది. వివాహమై వెళ్లిన కుముదిని ఆరు నెలలు తిరక్కముందే 'బాపూర్' స్వగ్రామానికి పుట్టింటికి..... తిరిగొచ్చింది.

అత్తింట్లో ఎంతనరకం అనుభవించిందో ఆమె శరీరం మీద కాలి నల్లబారిన బొబ్బల

సాక్ష్యమిచ్చాయి. చివరికి ఆకలితో కడుపు నకనకలాడుతుంటే, కేవలం ‘ తిండి కోసం’ గడపదాటి వచ్చింది. ఆమెను కొంతకాలం తల్లి భరించింది.

ఏనాటికైనా భర్తతోడిదే జీవితం అంటూ అందరూ తలోమాట అంటుంటే, చివరికి కూతురిని అత్తవారింటికి దిగబెట్టడానికి తీసుకువెళ్లింది. వెళ్లినట్లే వెళ్లి తిరిగి వెంటబెట్టుకొచ్చేసింది. పిడుగులాంటి వార్త మోసుకొచ్చింది. కుముదిని భర్త మరో పెళ్లి చేసుకుని ఈమెను వదిలేసాడని...

చుక్కానిలేని నావలా కుముదిని బతుకు సాగించలేక ఆ వూరు విడిచివెళ్లిపోయింది. అలా వెళ్లిన ఎందరో యువతులున్నారు.

‘ఝాన్సీ, మధుర ’ ప్రాంతాలలో వున్నవారిలో పెళ్లిళ్లు జరిగి ఆ తరువాత ఆయువతులంతా మెల్లమెల్లగా వ్యభిచార గృహాల్లోకి నెట్టవేయబడ్డారు.

‘మోహన్‌తంతి’ హోమ్‌గార్డుగా పనిచేస్తూ బాపూర్ గ్రామానికొచ్చినప్పుడు ‘అహల్య’ తారసపడింది. పరిచయం పెంచుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒక రోజు ఆ ఎర్రమట్టి రోడ్డు మీద నుంచే చేయి పట్టుకుని తీసుకువెళ్లాడు. ఆ తరువాత మధురకు చెందినవారికి అమ్మేసి ఆ డబ్బుతో పరారైపోయాడు. అహల్య తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేసాడు. పేదవాడి అరుపుకు ఏమాత్రపు విలువా వుండదు కదా.

ఆ ఎర్రమట్టి రోడ్డు ‘ రాహూండ్’ గ్రామ పంచాయితీకి కూడా విస్తరించింది. అక్కడికి తరచు వస్తూ పోతున్న వాళ్లు, లూధియానా, హర్యానాల్లో చేతినిండా పనీ, పుష్కలంగా డబ్బు దొరుకుతుందని అందరికీ ఆశ చూపారు. అక్కడే స్థిరనివాసం కావాలనుకున్నవాళ్లకు పెళ్లి ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయని మభ్యపెట్టారు. పొలం పనులు చేసుకున్న వారికి అదృష్టం కలసి వస్తున్నదంటుండేవారు.

గ్రామస్తులు కొంతమంది తమ కూతుళ్లను వెంటపెట్టుకొని వెళ్లి.. పెళ్లిళ్లు జరిపించేసి కొన్నాళ్లు అక్కడే వుండేవారు.

వున్నవూరు వొదిలి వాళ్లు మాత్రం ఎన్నాళ్లని వాళ్లకి తోడువుంటారు. అమ్మాయిల్ని అక్కడ అప్పజెప్పి వచ్చీరాగానే వారి జాడ, ఆచూకీ ఎవరికీ తెలియకుండా పోయేది. అంతే

ప్రతీ రోజు ఆ రోడ్డు  చివరి వరకు వచ్చి, రోదించి, ఎదురుచూసి, తమ దురదృష్టానికి, దౌర్భాగ్యానికి విలపించడమే వారి పనిగా మారేది.

ఇంత ఘోరం జరిగినా పోలీసు వారి దర్యాప్తు నామమాత్రమే.

'రవీంద్ర పరివరిడా'  ఒక ప్రక్క పెరిగే వయస్సు, యవ్వనంలో జరిగే పెళ్లి ముచ్చట '

అలాగే పేదరికం.

ఆమెకి అన్నీ సవ్యంగా జరిగినా సంసారం మాత్రం ఎన్నాళ్లో సాగలేదు. భర్త పరారైపోయాడు. ఒంటరిగా జీవితం నిస్సారమైపోయినా, తన చెల్లెలి జీవితమైనా చిగురించి ఫలించాలని కోరుకుంది.

బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి ఆ వూరుకొచ్చాడు. అతడికిచ్చి పెళ్లి చేస్తే సుఖపడుతుందని నిశ్చయించుకొని ఆర్భాటంగా చేయలేకపోయినా తనకున్న పరిధిలోనే కార్యం జరిపించింది. వధూవరుల్ని ఎర్రమట్టి రోడ్డు చివరి వరకు సాగనంపింది. అదే ఆఖరి వీడ్కోలని ఆమె అనుకోలేదు.

చెల్లెలు ఎక్కడుందో, ఎలా వుందో ఎవరికీ తెలియదు. ఆ రోడ్డు మీద తన చెల్లెలు వేసిన ఆఖరి అడుగుల చెదిరిపోకుండా ఇంకా వున్నాయోమోనని పిచ్చిదానిలా వెతుకున్నది ఇప్పటికీ రవీంద్రపరీడా.

ఆ వూరి ఆడపడుచు 'సుకాంతి' నవయవ్వన యువతి. నలుపైనా అందరికీ ఆకట్టుకునే ఆకర్షణ ఆమెది. హృదయాన్ని దోబూచులాడించే ఆకర్షణీయమైన చూపులు.

అవన్నీ కలగలిపి ఓ పంజాబీ వ్యక్తి దృష్టిలో పడ్డాయి. అతను తనదగ్గరున్న బంగారు కడియం, గొలుసు ఆమె మెడలో అలంకరించాడు. ఆ వేడుకకు సుకాంతి మురిసిపోయింది. ఆవూరి నుండి దర్జాగా నడిచి అతడితో పంజాబ్ మకాం మార్చేసింది. ఆ గ్రామంలో తనూ అలాగే వుండిపోతే తన తల్లి, అక్కలాగే ఎదుగుబొదుగులేక జీవచ్ఛవంలా మిగిలిపోవలసి వస్తుందని తన దారి తాను చూసుకుంది.

కొంతకాలానికి సంపాదనాపరురాలైంది. తనంత అదృష్టవంతురాలు ఎవరూ లేరన్నట్లుగా దర్జాగా తిరిగి గ్రామానికి చుట్టం చూపుగా వచ్చింది సుకాంతి.

ఆ గ్రామంలో గడప గడపకు వెళ్లి, తన విలాసవంతమైన జీవితాన్ని కథలు, కథలుగా చెప్పి నమ్మించింది. అప్పటికే పేదరికంలో మగ్గుతున్న పెళ్లికాని పడుచులంతా తమకీ అదృష్టాన్ని కల్పించమని, చక్కని దారిని చూపెట్టమని సుకాంతిని వేడుకున్నారు.

లేని ఆశల్ని రేకెత్తించడంతో సుకాంతి వెంటపడ్డారంతా. అదే అదను అనుకొని అందర్నీ ఆఎర్రమట్టి రోడ్డు దాటించిందామె. అందరూ చివరికి దగా పడిన ఆడపడుచుల్లా, వ్యభిచార రొంపిలోకి జారిపోయారు. పోలీసులు ఎంత చొరవ తీసుకున్నా వారి జీవితాలు తెరిపినపడలేదు.

ఇలా రణపూర్‌లో మొత్తంమీద మూడొందల మంది పెళ్లికాని పడుచులు ఒకరితరువాత ఒకరు అలా అదృశ్యం కావడం ఆ చుట్టు ప్రక్కల తీవ్ర సంచలనం రేపింది.

గ్రామస్తులు కొందరు ఆ దుస్థితిని భరించలేక ఆ రోడ్డులో, పై వూళ్ల నుండి వచ్చిపోయే వారిని అటకాయించి, ఎవరికోసం, ఎవరు ఎందుకోసం వస్తున్నారో వాకబుచేసి వెనక్కి తరిమారు.

హఠాత్తుగా ఓసారి 'నాయ్‌గడ్ జిల్లా ఎస్‌పి' పోలీసు జీపులో హుటాహుటీన ఆ ఎర్రమట్టి రోడ్డుపై దుమ్ములేపుకుంటూ వచ్చాడు. కాని ప్రయోజనం లేకపోయింది.

చట్టానికి భయపడుతూ, చాకచక్యంగా పరిస్థితిని చక్కదిద్దే సామర్థ్యం లేక సందిగ్ధంలో పడ్డారు గ్రామస్థులు. వారు తగిన సమాచార యివ్వకపోవడం వలన విచారణ మూలపడిపోయింది.

అదే ఎర్రమట్టిరోడ్డు ' కలహండి' దాటి ' జోడుబంధ' గ్రామం వరకు వెళ్లింది పగతీరని త్రాచుపాములా.

మధుర నుండి వచ్చిన ' ఇద్దరు వ్యక్తులు ఆ వూరి పెద్దలపేరూ, అడ్రస్సూ చెప్పి ఆ గ్రామంలో తిష్టవేసారు. గౌరి అనే అమ్మాయిని ఆ ఇద్దరిలో ఒకరు పెళ్లి చేసుకుంటానన్నారు. వారిద్దరూ కలసి ఆ ఇంటి వారిని ఒప్పించారు. పెళ్లి జపించారు.

ఆమె అన్నయ్య ' కులమణి'ని తోడిచ్చి అత్తింటికి పంపారు. అతను ఆమెనక్కడ దిగబెట్టి వచ్చేసాదు. అతడు అలా ఆమెను విడిచివెళ్లగానే 'గౌరి'ని మరో వ్యక్తికి అమ్మేసారు.

జరుగుతున్న సంఘటనలన్నింటికి అసలు కారణాలు వెలుగులోకి రావడంలేదని ఆ జిల్లా కలెక్టరుకు ఎస్పీ నివేదిక పంపడం విలేఖరులకు ఆశ్చర్యం కలిగించింది.

ఒక రోజు 'జీవచ్ఛవంలా' 'జయమణీ' అనే ఆవూరి అమ్మాయే ఆ ఎర్రమట్టి రోడ్డు మీద, దుమ్ము,ధూళితో స్పృహతప్పి పడిపోయింది. ఆవిధి వంచితురాల్ని ఎవరో అర్థరాత్రిపూ నిర్ధాక్షిణ్యం విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ఆ త్రోవని వచ్చేవారు చూసి ఆమెను ఆ వూళ్లోకి తీసుకువచ్చారు. సపర్యలు చేసాక ఆ మర్నాటికి తేరుకుంది. అవమానం భరించలేక నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది.

ఆ రోజునుండి ఆ ఎర్రమట్టి రోడ్డంతా నిర్మానుష్యమై పోయింది. ఇటువంటి చరిత్రలెన్నో కలిగిన ఆ గ్రామానికి దారి చూపిన రోడ్డు చూస్తుంటే ఎవరికైనా ఒళ్లు కంపరం పుడుతుంది. అసలు ఆ వూరికి ఆ మట్టిరోడ్డు ఎందుకొచ్చింది?

ఆ రోడ్డు లేకుంటే ఎందరి జీవితాలో నాశనం కాకుండా వుండేవని గ్రామస్తులు తలుస్తూనే, ఆ దారిని ఇంకా అలాగే వుంచేసారు. ఇందుకు ఎవరిని ప్రశ్నించాలి? ఎవరిని ఆక్షేపించాలి?

ఎర్రమట్టి రోడ్డు నిర్వికారంగా, తనకేం సంబంధం లేనట్లుగా అందరికీ సహకరిస్తూనే వుందింకా...

మానవత్వం మంటగలిపే చోటుగా గతుకులూ, రాళ్లూ, రప్పలో ఒళ్లంతా దెబ్బలుతిన్న పాములా దర్శనమిస్తూ ఇప్పటికీ అలా మిగిలే వుందా ఎర్రమట్టిరోడ్డు.

(విధి విలాసం, సెప్టెంబరు, 2006)